


గండి రామన్న దత్తసాయి ఆలయంలో
నేడు శ్రీ దత్త అనఘా వ్రతం

నిర్మల్ కల్చరల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : గండి రామన్న దత్తసాయి ఆలయం నిర్మల్‌లో గురువారం ఉదయం 9:30 గంటలకు సామూహిక శ్రీ దత్త అనఘా వ్రతం నిర్వహిస్తున్నట్లు సాయి దీక్ష సమితి ట్రస్ట్ ఒక ప్రకటనలో తెలిపింది. భక్తులు పూజా సామాగ్రి, పండ్లు, పూలు తదితర సామాగ్రి తీసుకురావాలని కమిటీ కోరింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.



ప్రతిభావంతులకు ట్రిపుల్ ఐటీ ఆహ్వానం





- అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల
- ఈ నెల 31వ తేదీ నుంచి జూన్ 21 వరకు దరఖాస్తుల స్వీకరణ
- గ్రామీణ విద్యార్థులకు 85 శాతం సీట్లు
- మహబూబ్‌నగర్‌లో మరో క్యాంపస్
- పెరగనున్న 180 సీట్లు

బాసర, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ఇంజనీరింగ్ చదవాలంటే రూ. లక్షల ఖర్చు విషయంగా మారిపోయింది. అయినా ఉన్నతమైన, నాణ్యమైన విద్య అందుతుందా అంటే నమ్మకం లేదు. ఇంత ఖర్చు చేసే స్తోమతలేని నిరుపేద, మధ్యతరగతి వారికి బాసర ట్రిపుల్ ఐటి ఒక వరంగా చెప్పు కోవచ్చు. పదవతరగతి తర్వాత విద్యార్థులకు ఉన్నతమైన నాణ్యతతో కూడిన సాంకేతిక విద్యను అభ్యసించేందుకు బాసరలోని ట్రిపుల్ ఐటి సువర్ణ అవకాశం కల్పిస్తోంది. ఈ విద్యాసంస్థకు ఎంపికైన విద్యార్థి ఇంటర్‌తో పాటు ఇంజనీరింగ్ పూర్తిచేస్తారు. ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థులు చాలా మంది చదువు అనంతరం ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాలు సాధిస్తున్నారు. ప్రైవేటు, ప్రభుత్వ రంగాల్లో రూ.లక్షల వేతనంతో ఉద్యోగాలకు ఎంపిక అవుతున్నారు. ఈ విద్యా సంస్థ ప్రవేశాలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం ప్రత్యేక కథనం.

మహబూబ్‌నగర్‌లో మరో ఆర్జీయూకేటీ క్యాంపస్

బాసర తరహాలో రాష్ట్రంలో మరో ఆర్జీయూకేటీ క్యాంపస్ ఏర్పాటు కానుంది. మహబూబ్‌నగర్‌లో కొత్త క్యాంపస్ ఏర్పాటు చేస్తూ బుధవారం రాష్ట్రప్రభుత్వం జీవో 24ను విడుదల చేసింది. కొత్తక్యాంపస్ ఈ ఏడాది నుంచి అందుబాటులో రానుంది. 180 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నారు. ఇప్పటికే అక్కడ తాత్కాలిక భవనాలు పరిశీలించారు. బాసర క్యాంపస్‌లో ఏడు ఇంజనీరింగ్ కోర్సులను ఆఫర్ చేస్తుంటే కొత్త క్యాంపస్‌లో మాత్రం మూడు కోర్సులను మాత్రమే ప్రవేశపెడుతున్నారు. కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డేటా) కంప్యూటర్ సైన్స్(మిషన్‌లెర్నింగ్) వంటి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న కోర్సులను బోధిస్తున్నారు. కొత్త క్యాంపస్‌కు సంబంధించి నియామకాలకు అవసరమైన నిధులను మంజూరు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం జీవోలో పేర్కొంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో కొత్తగా రెండు ఆర్జీయూకేటీ క్యాంపస్‌లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసి మరొకటి కరీంనగర్ జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించిన చివరి క్షణంలో కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ ఏడాది ప్రారంభించలేకపోయింది. వచ్చే ఏడాది ఆ క్యాంపస్ కూడా ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

గ్రామీణ విద్యార్థులకు 85 శాతం సీట్లు

ప్రస్తుతం బాసర క్యాంపస్‌లో ప్రతీఏటా 1500 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నారు. ఇందులో 85 శాతం సీట్లు గ్రామీణ విద్యార్థులకు కేటాయిస్తున్నారు. అందులో ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు. అన్ని విద్యాసంస్థల్లో మాదిరిగానే ఇక్కడ రిజర్వేషన్‌ల వారీగా సీట్ల కేటాయింపు జరుగుతుంది.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 24 మార్కులు అదనం

ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని యూనివర్సిటీ ఏర్పాటు చేశారు. అందుకే అడ్మిషన్‌లలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో జరిగిన విద్యార్థులకు ఇది వరకు పదవ తరగతిలో సాధించిన గ్రేడుకు అదనంగా 0.4 పాయింట్లు కలిపేవారు. ఈ సారి పదవతరగతి విద్యార్థులకు గ్రేడులతో పాటు మార్కులు ప్రకటించడంతో ఒక్కో సబెక్టు నాలుగు మార్కుల చొప్పున 24 మార్కులను కలుపుతున్నారు. అంటే ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు 540 మార్కులు వస్తే మరో 24 మార్కులు కలిపి 564 మార్కులను అడ్మిషన్ ప్రక్రియలు పరిగణలోకి తీసుకొని విద్యార్థులను ఎంపికచేయనున్నారు. ఈ విధానంతో ప్రైవేటు విద్యాసంస్థలో చదివిన విద్యార్థుల కంటే గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన పేద విద్యార్థులకు ట్రిపుల్‌ఐటీ ప్రవేశంలో ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు.

దరఖాస్తు చేసుకునే విధానం

బాసర క్యాంపస్‌లో 1500 మంది, మహబూబ్‌నగర్‌లో క్యాంపస్‌లో 180 మంది విద్యార్థులకు ఏడాది ప్రవేశం కల్పిస్తూ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ ఏడాది పదవ తరగతి వార్షిక పరీక్షలు మొదటిసారి రాసి ఉత్తీర్ణులు అయిన విద్యార్థులు మాత్రమే ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 31వ తేదీ నుంచి జూన్ 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఆర్జీయూకేటీ.ఎసీ.ఇన్ టీఎస్ ఆన్‌లైన్ సెంటర్ ద్వారా వివిధ ధృవీకరణ పత్రాలు సమర్పించి దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు అనంతరం ఏఏ పత్రాలు అయితే సమర్పించామో వాటి జిరాక్స్ కాపీల సెట్‌ను యూనివర్సిటికి రిజిష్టర్ పోస్టు ద్వారా పంపించాలి. విద్యార్థులు యూనివర్సిటికి వచ్చి దరఖాస్తు చేసుకునే విధానం లేదు. కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులను స్వీకరిస్తారు. ఎంపిక జాబితా కూడా యూనివర్సిటి వెబ్‌సైట్‌లోనే ప్రకటిస్తారు. వెబ్‌సైట్ చూసుకొని విద్యార్థులు వారు కేటాయించిన తేదీల్లో క్యాంపస్‌కు వచ్చి కౌన్సిలింగ్‌లో పాల్గొని చేరాల్సి ఉంటుంది. జులై 4వ తేదీన ఎంపికైన విద్యార్థుల జాబితాను అధికారులు విడుదల చేయనున్నారు.

అందిస్తున్న కోర్సులు

ఈ విద్యా సంస్థలో ఒక్కసారి చేరిన విద్యార్థులు ఆరు సంవత్సరాల పాటు చదువుకోవాలి మొదటి రెండు సంవత్సరాలు (ప్రి యూనివర్సిటీ కోర్సు) ఇంటర్మీడియట్ ఎంపీసీ సబ్జెక్టులతో పాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎన్విరాన్మెంట్ సైన్స్ సబెక్టులు ఉంటాయి. ఈ రెండేళ్లు చదివిన తర్వాత కూడా విద్యార్థులు ఒకవేళ అవసరమైతే బయటకెళ్లి చదువుకోవచ్చు. మొదటి రెండు ఏళ్ల తర్వాత సాధారణంగా మిగతా నాలుగేళ్ల పాటు ఇంజరింగ్ కోర్సు ఉంటుంది. సివిల్, కంప్యూటర్ సైన్సు, ఈఈఈ, ఈసీఈ, మెకానికల్, కెమికల్, మెటలార్జికల్ ఇంజనీరింగ్ కోర్సులు ఉంటాయి. కొత్తగా ఏర్పాటు చేస్తున్న మహబూబ్ నగర్ క్యాంపస్‌లో రెండు కొత్త కోర్సులను ప్రవేశపెట్టారు. కంప్యూటర్ సైన్స్(ఆర్టిషియల్ ఇంటెలిజెన్స్ డేటా) కంప్యూటర్ సైన్స్ మిషన్ లెర్నింగ్ వంటి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న ఈ రెండు కోర్సులతో పాటు కంప్యూటర్ సైన్స్ కోర్సును విద్యార్థులు చదివే అవకాశం ఉంది. మొదటి రెండు సంవత్సరాలలో విద్యార్థులు సాధించిన ప్రతిభ ఆధారంగా రిజర్వేషన్లకు అనుకూలంగా ఇంజనీరింగ్ కోర్సుల కేటాయింపు ఉంటుంది. విద్యార్థులకు నచ్చిన కోర్సు రావచ్చు, రాకపోవచ్చు.

ఫీజుల వివరాలు


ఎంపికై ప్రవేశం పొందిన విద్యార్థులు పీయూసీ మొదటి రెండు సంవత్సరాలు ఏడాదికి రూ.36 వేలు తర్వాత ఇంజనీరింగ్ చదివే సమయంలో ఏడాదికి రూ.40 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ అర్హత ఉన్న విద్యార్థులు ప్రభుత్వం చెల్లించిన ఫీజు మినహాయించుకుని మిగతా బ్యాలెన్స్ ఫీజును విద్యార్థుల ఉంచి యూనివర్సిటీ అధికారులు వసూలు చేస్తున్నారు. గ్లోబల్ కోట కింద ప్రవేశం పొందిన విద్యార్థులు ఏడాదికి రూ. లక్షన్నర వరకు కట్టాల్సి ఉంది. ప్రవేశం పొందిన విద్యార్థులకు యూనివర్సిటీ అధికారులు లాప్‌టాప్‌తో పాటు యూనిఫార్మ్, ఇతర హాస్టల్ సామాగ్రి, సౌకర్యాలు కల్పిస్తున్నారు.

తీవ్ర పోటీ

పదవతరగతి తర్వాత ఎలాంటి ఎంట్రెన్స్ ఎగ్జామ్ లేకుండా మార్కుల ఆధారంగా ప్రవేశం కల్పిస్తున్న ఆర్జీయూకేటీలో ప్రవేశాలకు తీవ్రపోటీ నెలకొంటుంది. గత ఏడాది వరకు పదవ తరగతిలో కనీసం 9.8 జీపీఏ వచ్చిన విద్యార్థులే ఎంపికయ్యారు. కొంత మంది జీపీఏ 10 వచ్చినా రిజర్వేషన్ సీక్వేషన్‌లో సీటు పొందలేకపోయారు. ఈ సారి పదవ తరగతి ఫలితాలు మార్కులు కూడా ప్రకటించారు. ఈ లెక్కన 590 పైన మార్కులు వచ్చినా ట్రిపుల్ ఐటీలో సీటు దొరుకుతుందని గ్యారెంటీగా చెప్పలేని పరిస్థితి నెలకొంటుంది. ఒకసారి ప్రవేశం పొందిన విద్యార్థులు ఇంజనీరింగ్ పూర్తయ్యే వరకు ఇక్కడే నామమాత్ర ఫీజుతో కోర్సులను పూర్తి చేసుకునే అవకాశం ఉంది. కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్య బోధన చదువు పూర్తి కాగానే విద్యార్థులు మంచి ఉద్యోగాలు సాధించి జీవితాల్లో స్థిరపడ్డ విద్యార్థులు ఎంతోమంది ఉన్నారు. ఈ కారణంగానే బాసర ట్రిపుల్ ఐటీలో చేరేందుకు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.

ముఖ్యతేదీలు

మే 31వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ
చివరి తేదీ జూన్ 21
దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ధృవపత్రాలు పంపించేందుకు
ఆఖరి తేదీ జూన్ 25
జూలై 4వ తేదీన ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల
జూలై 7వ తేదీ నుంచి కౌన్సెలింగ్





జయంతి వేడుకల్లో టీడీపీ నాయకులు

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

నిర్మల్ కల్చరల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో తెలుగుదేశం పార్టీ నాయకులు స్వర్గీయ ఎన్టీఆర్ 102 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ... ఎన్టీఆర్ హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. 2 రూపాయలకే కిలోబియ్యం అందించి బడుగు ప్రజల ఆకలి తీర్చారన్నారు. తెలుగు ప్రజల ఖ్యాతిని దశదిశల చాటిన మహానుభావుడని ఆయన ఆశయసాధనలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కే. భూషణ్‌రెడ్డి, రాంకిషన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సిరికొండ రమేష్, భీమ్‌రెడ్డి, షైక్ మౌలానా, డి.శ్రీనివాస్, ఆకోజి కిషన్, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడమే
రాజీవ్ యువ వికాసం పథకం లక్ష్యం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు పుష్కలమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మంత్రి పొన్నం ప్రభాకర్, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శ్రీధర్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ శ్రీధర్‌లతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... జూన్ 2వ తేదీ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తామన్నారు. ఈ పథకం అమలు ద్వారా రాష్ట్రంలోని నిరుద్యోగులందరూ స్వశక్తితో ఎదుగుతారని తెలిపారు. ఈ పథకం ద్వారా బడుగు, బలహీన వర్గాల వారికి ఎంతగానో లాభం చేకూరుతుందన్నారు. సుదీర్ఘ కసరత్తు తర్వాత ఈ పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. మొక్కుబడిగా పథకాన్ని అమలు చేయడమే కాకుండా, రానున్న రోజుల్లో లబ్ధిదారుల ఎదుగుదలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారన్నారు. దాదాపు 5 లక్షల మంది యువతకు లబ్ధి చేకూరేలా 8 వేల కోట్ల రూపాయలను ఈ పథకానికి వెచ్చించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ పథకం ద్వారా లబ్ధి పొంది వ్యాపారాలు చేస్తున్న వారికి ఇబ్బందులు కలిగితే అధికారులు చొరవ తీసుకొని వారి ఇబ్బందులను తొలగించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ... జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. లబ్ధిదారుల గుర్తింపుకు సంబంధించిన వివరాలను ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి, జడ్పీ సీఈవో గోవింద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, మైనార్టీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, ఎల్డీఎం రామ్‌గోపాల్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



ధాన్యం కొనుగోలు చేయట్లేదని పీఏసీఎస్ ముందు నిప్పు పెట్టి నిరసన



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ముందు మంట పెట్టి నిరసన వ్యక్తం చేసిన రైతులు

నిర్మల్ రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ముందు కట్టెలు వేసి నిప్పంటించారు. ఈ ఘటన మండలంలోని ముక్తాపూర్‌లో చోటు చేసుకుంది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటను కొనుగోలు కేంద్రానికి తరలిస్తే మ్యాచర్ రాలేదని తూకం వేయడం లేదని ఆవేదన చెంది బుధవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ముందు కట్టెలు వేసి నిప్పంటించారు. కొన్ని రోజులుగా అకాల వర్షం కురుస్తుందని దీంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు.

దడ్వాయిల సమస్యలు పరిష్కరించాలి

- యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న దడ్వాయి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సురేందర్ రెడ్డి

భైంసా, మే 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో పనిచేసే దడ్వాయిలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని దడ్వాయిల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.బుధవారం భైంసాలో జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా దడ్వాయిల సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కనీస వేతన చట్టానికి అనుగుణంగా దడ్వాయిలకు వేతనాలను ఇవ్వాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల కొనుగోలు కేంద్రాల వద్ద తూకాలు వేసే ప్రక్రియలో దడ్వాయిలకు పని కల్పించాలన్నారు. ఇదే క్రమంలో యార్డుల పరిధిలో దడ్వాయిలకు అన్ని రకాల వసతుల, సౌకర్యాలు కల్పించాలన్నారు. సంఘ బాధ్యులందరం ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా సంఘ సభ్యుల సంక్షేమానికి బాధ్యతాయుతతో కృషి చేస్తున్నామని వెల్లడించారు. సంఘ సభ్యులందరూ సంఘటితంగా వ్యవహరిస్తూ సమన్వయంతో పని చేయాలన్నారు.మార్కెట్ కమిటీల పరిధిలో సమస్యలు ఏర్పడినపుడ సంఘ సభ్యులందరూ ఐక్యతతో వాటిని పరిష్కరించుకునే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. సమస్య జఠిలమైన పక్షంలో రాష్ట్ర శాఖ బాధ్యతాయుతతో వాటి పరిష్కారానికి పాటు పడుతుందని వెల్లడించారు. ఇందులో యూనియన్ రాష్ట్ర నాయకులు సంజీవ్, బోనాల వీరన్న, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధులు మోహన్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, భైంసా దడ్వాయి యూనియన్ అధ్యక్షులు సతీష్‌తో పాటు ఆయా ప్రాంతాల దడ్వాయిలు, యూనియన్ బాధ్యులు పాల్గొన్నారు.

ఎలాంటి ఆంక్షలు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

- రైతులు ఆందోళన చెందవద్దు : కలెక్టర్ అభిలాష అభినవ్

సారంగాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గల స్థానిక రాజీవ్ కాటన్ మార్కెట్ యార్డుతో పాటు జామ్, ధని, చించోలి బి గ్రామాలలో కొనుగోలు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి రైతులను వివరాలు తెలుసుకున్నారు. ఈ ఏడాది 15 రోజుల ముందే వర్షాలు కురవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే తూకం చేయించి రెండు రోజుల్లో రైస్‌మిల్లులకు తరలిస్తామని హామీ ఇచ్చారు. రైతులు తూకం చేసిన ధాన్యం బ్యాగులపై వర్షం వచ్చిన సమయంలో టార్పాలిన్లను కప్పి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు పంపించడానికి చర్యలు తీసుకోవాలని ధాన్యం కొనుగోలు చేసే నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు.

విస్తృతంగా పర్యటించిన జిల్లా స్థాయి అధికారులు

మండల కేంద్రంతో పాటు జాం, దని, చించోలి(బి) గ్రామాలలో కొనుగోలు చేస్తున్న కేంద్రాలను రెవెన్యూ అదనపు కలెక్టర్ సైజాన్ అహ్మద్‌తో పాటు డీసీవో పాపయ్య, డీఎం సివిల్ సప్లయ్ సుదర్శన్, డీసీఎస్‌వో కిరణ్‌కుమార్‌లతో జిల్లా స్థాయి అధికారులు పరిశీలించారు. వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న ధాన్యంను తరలించడానికి ఎన్ని లారీలు అవసరమని లెక్కించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో వివరాలను అడిగి తెలుసుకొని వెంటనే ధాన్యం తూకం చేసేలా కొరత లేకుండా తగు చర్యలు తీసుకొని, ధాన్యం కొనుగోలు కేంద్రంలో రోజంతా ఉండి ధాన్యాన్ని లారీలలో రైస్‌మిల్లర్లకు తరలించారు. వీరి వెంట తహసీల్దార్ శ్రీదేవి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

బక్రీద్ పండుగ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

నిర్మల్ అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : బక్రీద్ పండుగను శాంతియుతంగా, సమగ్రంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన బక్రీద్ పీస్ కమిటీ సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాబోయే జూన్ నెలలో జరగనున్న బక్రీద్ పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు, పుకార్లు వ్యాపించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ సందర్భంగా పోలీసుశాఖ తరఫున జిల్లా పటిష్ఠ భద్రత చర్యలు చేపడతామని తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పోలీసు బలగాలు అప్రమత్తంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, పీస్ కమిటీ సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

భూ సర్వేలో సర్వేయర్లది కీలకమైన పాత్ర

నిర్మల్ అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : భూ సర్వేల నిర్వహణలో సర్వేయర్లది ముఖ్యమైన పాత్ర అని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. లైసెన్స్ సర్వేయర్లకు బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సర్వే కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారికి కీలక సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ భారతి చట్టాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ చట్టాన్ని అనుసరించి భూ సమస్యలను సర్వేయర్లు పరిష్కరించాలన్నారు. శిక్షణ కాలంలో అధికారుల నుంచి అన్ని విషయాలను సమగ్రంగా తెలుసుకొని క్షేత్రస్థాయిలో భూ సర్వేలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కాగా జిల్లాలో 113 మంది లైసెన్స్ సర్వేయర్లకు 50 రోజులపాటు ఉదయం, సాయంత్రం రెండు పూటలా శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు.

కేజీబీవీలలో ధర్మ సేవ ట్రస్ట్ నిర్వహిస్తున్న ధీర వెల్నెస్ కార్యక్రమం అభినందనీయం

నిర్మల్ రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : కేజీబీవీలలో ధర్మ సేవ ట్రస్ట్ నిర్వహిస్తున్న ధీర వెల్నెస్ కార్యక్రమం అభినందనీయమని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ధర్మ సేవ ట్రస్ట్ జిల్లాలోని ఆరు కేజీబీవీలలో నిర్వహించిన ధీర వెల్నెస్ కార్యక్రమల మీద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధర్మ సేవ ట్రస్ట్ ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఫిబ్రవరి 25 నుంచి ఏప్రిల్ 1 వరకు జిల్లాలోని 6 కేజీబీవీ అభినందనీయమన్నారు. ఈ వెల్నెస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు యోగ, నీతికథలు, ఆటలు, ఆర్ట్స్ అండ్ డ్రాయింగ్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా బాలికల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయడం జరిగిందన్నారు. జూన్ 26 రోజున ఇంటర్నేషనల్ డే డ్రగ్ అబ్యూస్ డే సందర్భంగా జిల్లాలోని డిగ్రీ కళాశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలలో, అన్ని ఉన్నత పాఠశాలలో ఈ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దమొత్తంలో ర్యాలీలు నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, 'డ్రగ్ ఫ్రీ నిర్మల్'గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలోని కళాజాత బృందాలు గ్రామాల్లో మత్తు పదార్థాల నిర్మూలనపై, మాదక ద్రవ్యాల ద్వారా కలిగే అనర్థాలపై విశేష అవగాహన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ధర్మ సేవ ట్రస్ట్ అందించిన పరిజ్ఞానం భవిష్యత్తులో విద్యార్థుల ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జి విద్యాశాఖ అధికారి ఎం.పరమేశ్వర్, సమన్వయకర్త జి. లింబాద్రి, ధర్మ సేవ మేనేజింగ్ ట్రస్ట్ నిశాంత్‌రెడ్డి, ధర్మ సేవ ధీర ప్రోగ్రాం నిర్మల్ కోఆర్డినేటర్ ఎస్. స్రవంతి, డీసీవో గీత, ఏసీఎంవో శివాజీ, కేజీబీవీల ప్రత్యేక అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



భూ సర్వేయర్లకు సర్వే కిట్లను అందజేస్తున్న దృశ్యం



బోథ్‌లో పార్టీ జెండాను ఎగరవేస్తున్న టీడీపీ నాయకులు

పేదల అభ్యున్నతికి ఎన్టీఆర్ ఎనలేని కృషి

(5వ పేజీ తరువాయి...)

ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం దివంగత నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారన్నారు. టీడీపీ అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిందని, ఎంతోమందికి రాజకీయ జీవితాన్ని ఇచ్చిందన్నారు. రూ.రెండు కిలో బియ్యం పథకాన్ని ప్రారంభించి దేశంలోనే పేరు ప్రఖ్యాతులు గాంచిందన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఐటి రంగాన్ని అభివృద్ధి చేశారన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అభివృద్ధి చెందిందంటే అప్పటి టీడీపీ ముఖ్యమంత్రి కృషితోనే అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి చందు, వడ్ల పి.నర్సారెడ్డి, గొల్ల నారాయణ, కిషన్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన

ఉట్నూర్, మే 28(ఆంధ్రజ్యోతి): పరివర్తన్ ఫౌండేషన్ ఉట్నూర్ వారి ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్యస్పందన లభించింది. యువకులు, విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తహీనతతో బాధపడుతు న్న వారికి సహాయాన్ని అందించడానికి తాము కూడా తోడ్పాటు అందిస్తామని అన్నారు. దీంతో వారిని ఏజెన్సీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కుడుమెత మనోహర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జాదవ్ ఉపేందర్‌లు అభినందించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు డా.ఉపేందర్‌జాదవ్, డాక్టర్ కపిల్‌నాయక్, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్, డా. సతీష్, డా.దీపక్‌పుష్కర్, డా.సాయిప్రశాంత్‌రెడ్డి, డా.రవిరాథోడ్, డా.విక్రమ్, డా.మహేందర్‌బానోత్, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'రైతులను వేధిస్తే సహించేది లేదు'

నేరడిగొండ, మే 28(ఆంధ్రజ్యోతి): గత 60 ఏళ్లకు పైగా అటవీ భూమిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న గిరిజన, గిరిజనేతర రైతుల భూములలో అటవీ శాఖ అధికారులు మొక్కలు నాటే ప్రయత్నం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు సంయమనం పాటించాలని సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్ అన్నారు. బుధవారం నేరడిగొండ మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఈ విషయమై ప్రత్యేక చొరవ తీసుకొని అనేక సార్లు సమీక్ష నిర్వహించి మాట్లాడడం జరిగిందన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఈ విషయంపై ప్రత్యేకశ్రద్ధ వహించి పోడు భూముల సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

'కక్షపూరితంగానే అక్రమ కేసులు'

ఆదిలాబాద్ టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): తనపై కక్షపూరితంగానే కొంత మంది అక్రమ కేసులు బనాయిస్తున్నారని 4వ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరి గంగాధర్ మండిపడ్డారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తాను ఎవరినీ మోసం చేయలేదని, ఎలాంటి అక్రమ పట్టాలు ఇవ్వలేదని పేర్కొన్నారు.

ప్రమాదాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణం

● తర్నం బ్రిడ్జిని పరిశీలించిన మాజీ మంత్రి జోగు రామన్న



తర్నంలో లోలెవల్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న రామన్న

జైనథ్, మే 28(ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని తర్నం గ్రామ సమీపంలోని సాత్నాల నదిపై తాత్కాలికంగా నిర్మించిన లోలెవల్ బ్రిడ్జిని మాజీ మంత్రి జోగు రామన్న బుధవారం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ లోలెవల్ బ్రిడ్జి కారణంగా వరదల్లో ప్రజలు, ప్రయాణికులు తమ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిండు నిర్లక్ష్యం కారణంగా తర్నంలోని సాత్నాల నదిపై ఇంత వరకు బ్రిడ్జి నిర్మాణం కాలేదన్నారు. దీంతో జైనత్, బేల మండలతో పాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర ప్రజలు, ప్రయాణికులు జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్‌కు చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. యుద్ధప్రాతిపదికన బ్రిడ్జిని నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జైనథ్ మండల మాజీ ఎంపీపీ ఎం.గోవర్ధన్, తర్నం మాజీ సర్పంచ్ బండి రాధిక గజానన్‌లతో పాటు తర్నం గ్రామ ప్రజలు, ఆయా గ్రామాల ప్రయాణికులు పాల్గొన్నారు.

● 'అభివృద్ధి పనులను పట్టించుకోరా?'

ఆదిలాబాద్, మే 28(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ఎమ్మెల్యే, ఎంపీ అభివృద్ధి పనులను పట్టించుకున్న పాపాన పోలేదంటూ మాజీ మంత్రి జోగు రామన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జైనథ్ మండలం తర్నం బ్రిడ్జి పనులను పూర్తి చేసి ఉంటే లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన లాండేదత్తు ప్రాణం పోయేది కాదన్నారు. ఆదిలాబాద్ నియోజక వర్గంలో జరుగుతున్న పనులను పట్టించుకోకుండా బీజేపీ, కాంగ్రెస్ నేతలు కమిషన్లకే కక్కుర్తి పడుతున్నారని ఆయన ఈ సందర్భంగా మర్శించారు. ఈ సమావేశంలో రౌతు మనోహర్, గోవర్ధన్, రాజన్న, కశ్యప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'బ్రిడ్జి కూల్చివేతపై విచారణ జరిపించాలి'

ఆదిలాబాద్ అర్బన్: లాండేదత్తు మృతికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలని మాజీ మంత్రి జోగు రామన్న బుధవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలతో తర్నం బ్రిడ్జి వద్ద వాగు పొంగి పొర్లుతున్న సదరు కాంట్రాక్టు సిబ్బందితో పాటు ప్రభుత్వ యంత్రాంగం బ్రిడ్జి వద్ద ఎలాంటి హెచ్చరికలు జారీ చేయలేదని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహ రించి దత్తు మృతికి కారకులయ్యారని ఆరోపించారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని, రూ.25 లక్షల ఆర్థిక సాయంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. ఇందులో యూనిస్‌అక్బాని, ఇజ్జగిరి నారాయణ, మార్శెట్టి గోవర్ధన్, సాజిదొద్దిన్, సతీష్, తదితరులున్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

బోథ్, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబిర గ్రామానికి చెందిన ఆత్రం దశరథ్(49) అనే వ్యక్తి బుధవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాలు కుటుంబీకుల ఫిర్యాదు ప్రకారం ఇలా ఉన్నాయి. మృతుడు గత రెండేళ్లుగా కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని, అయితే మనోవేదన గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు ఆత్మహత్య తాగాడు. మధ్యాహ్నం కుటుంబీకులు ఇంటికి తిరిగివచ్చి చూసేసరికి అచేతన స్థితిలో పడి ఉండడంతో 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. దీంతో బోథ్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇద్దరిపై గంజాయి కేసు

సోనాల,మే28(ఆంధ్రజ్యోతి):మండలంలోని పార్డి(కె) గ్రామంలో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో బోథ్ సీఐ వెంకటేశ్వరరావు బుధవారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన సోలంకి గులాబ్‌సింగ్ ఇంటి ఆవరణలో ఐదు అలాగే రాంసింగ్‌చౌహాన్ ఇంట్లో మూడు మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి సేవించి, మొక్కలను నాటిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్సై ప్రవీణ్‌కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

దొరికిన పర్సు అందజేత

బోథ్, మే 28 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రానికి చెందిన వేముల శ్రీనివాస్ అనే వ్యక్తి మంగళవారం రాత్రి బస్టాండ్ ప్రాంతంలో తన పర్సు పోగొట్టుకున్నారు. అయితే బోథ్ బస్టాండ్‌లో పాన్‌షాప్ నిర్వాహకుడు సుల్తాన్‌కు లభించడంతోఈ విషయమై లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ వారికి తెలిపారు. దీంతో పేపర్లను పరిశీలించి.. సదరు వ్యక్తి స్థానికుడు అని తేలడంతో పర్సును పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. బాధితుని పిలిపించి బుధవారం పర్సును కానిస్టేబుల్ గంగాప్రసాద్ చేతుల మీదుగా అందించారు. ఇందులో మాసం అనిల్, మురారి, సంజీవ్, బిక్కు లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఉట్నూర్, మే 28(ఆంధ్రజ్యోతి): విద్యా అభివృద్ధికి నిత్యం పాటు పడుతున్న ప్రజా ప్రభుత్వం ఖానాపూర్ నియోజకవర్గానికి రూ.200 వందల కోట్ల యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేసినందున సీఎం రేవంత్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆర్టీఏ జిల్లా సభ్యుడు దూట రాజేశ్వర్, జైనూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భానోత్ జైవంత్‌రావ్, డైరెక్టర్ రాధాబాయి, ఉట్నూర్ మండల అధ్యక్షుడు కయ్యుమ్, తదితరులున్నారు.

చేతికి వచ్చిన పంటను ముంచిన వాన

బేల, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్సన్న గ్రామంలో గెడం అర్పణ తన రెండెకరాల పొలంలో నువ్వు పంటను సాగు చేశారు. దాదాపుగా రూ.20 వేలు పెట్టుబడి పెట్టగా.. ప్రస్తుతం కనీసం రూ.20 కూడా చేతికి అందేలా లేవని ఆమె ఆందోళన చెందారు. నిన్నటిదాకా ఆకుపచ్చగా ఉన్న పంట.. అకాల వర్షానికి తడిసిముద్దయ్యిందని వాపోయింది. చివరికి కన్నీరే మిగిలిందని.. నమ్ముకున్న పంట చేజారిపోవడంతో ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్ట పోయిన రైతులకు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని బాధితురాలు ఈ సందర్భంగా కోరారు.



వర్షానికి తడిసి ముద్దయిన నువ్వుల పంట



కొత్తగా తర్నం బ్రిడ్జిని నిర్మించే ప్రదేశం ఇదే..

దారి కష్టాలు.. ఇంకెన్నాళ్లు?

(5వ పేజీ తరువాయి...)

చేపట్టాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సాత్నాల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మంగళవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి వరద ఉధృతి పెరిగింది. రాత్రి 8గంటల ప్రాంతంలో జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన లాండే దత్తు (30) అనే యువకుడు రాత్రి సమయంలో ద్విచక్ర వాహనంపై తాత్కాలిక వంతెన పై నుంచి వరద నీటిని దాటుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతయ్యాడు. అయితే అధికారులు భద్రత చర్యలు చేపట్టి ఉంటే నిండు ప్రాణం పోయేది కాదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నా.. పని ప్రదేశంలో ఎలాంటి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయక పోవడం అధికారులు, కాంట్రాక్టర్ నిండు నిర్లక్ష్యానికి కారణమంటున్నారు. మృతుడి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

అడ్డగోలుగా తాత్కాలిక వంతెన

తర్నం బ్రిడ్జి సమీపంలో నిర్మించిన తాత్కాలిక బ్రిడ్జి నిర్మాణ పనులు అడ్డగోలుగా ఉన్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎలాంటి నియమ నిబంధనలు పాటించకుండానే లోలెవల్ వంతెనను నిర్మించడం తీవ్ర విమర్శలకు దారి తీస్తుంది. లోలెవల్ వంతెనను నిర్మించేందుకు ప్రభుత్వం రూ.4.50 కోట్ల నిధులను మంజూరు చేసింది. కానీ క్షేత్రస్థాయిలో పనులను చేపట్టిన తీరును చూస్తుంటే నిధులు దుర్వినియోగమైనట్లు తెలుస్తుంది. బ్రిడ్జి ఎత్తును మరింత పెంచాల్సి ఉండగా.. రెండు మీటర్ల లోపే నిర్మించడం సరికాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నా యి. లోలెవల్ వంతెనను నిర్మించిన ప్రయోజనం లేదంటున్నారు. చిన్నపాటి వర్షాలకే లోలెవల్ బ్రిడ్జిపై నుంచి వరదనీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. బ్రిడ్జిపై నుంచి ఉధృతంగా ప్రవహించిన వరదనీటిలో చిక్కుకొని ఓ యువకుడు మృతి చెందడం చూస్తుంటే పనులు ఏ విధం గా ఉన్నాయో? ఇట్టే అర్థమవుతుంది. అలాగే బ్రిడ్జిని నిర్మించిన నెల రోజులకే పగుళ్లు, కంకర తేలి సిమెంట్ పనులు కనిపిస్తున్నాయి. బ్రిడ్జి నిర్మాణం నాణ్యతపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్న ఏమాత్రం ప్రయోజనమే లేకుండా పోతోందని ప్రయాణికులు వాపోతున్నారు.

వరదనీటిలో యువకుడి గల్లంతు

(5వ పేజీ తరువాయి...)

తన స్వగ్రామం లక్ష్మీపూర్ వెళ్తుండగా తర్నం లోలెవల్ బ్రిడ్జి దాటుతుండగా వరదనీరు అధికం కావడంతో మోటర్ సైకిల్‌తో పాటు వరద నీటిలో కొట్టుకపోయాడు. విషయం తెలుసుకున్న ఎస్సై గౌతం ఆధ్వర్యంలో పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు.బుధవారం సైతం గాలింపు నిర్వహించగా.. మృతదేహం లభ్య కాలేదు. మృతుడికి భార్య లాండే జ్యోత్స్న, బాబు, కుమార్తె ఉన్నారు. కాగా గాలింపు ముమ్మరం చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.



కుంటాలలో అధికారులతో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కుంటాల, మే, 28 : (ఆంధ్రజ్యోతి) : వర్షాలు కురుస్తున్నందున గ్రామాలలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన అంగన్‌వాడీ, ఆశావర్కర్స్ పంచాయతీ సెక్రటరీలు, ఏఎన్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జనవాసాల మధ్య నీరు నిల్వకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు మురికి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలన్నారు. అంతేగాకుండా రాజీవ్ యువవికాసంలో నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. ఎరువులు, విత్తనాల దుకాణాల్లో నకిలీ విత్తనాలు విక్రయించకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కమల్, ఎంపీడీవో లింబాద్రి, వ్యవసాయాధికారి విక్రమ్, ఏపీఎం అశోక్, ఏపీవో నవీన్, ఎంపీవో రహీం తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఇచ్చే వ్యాక్సిన్‌లకు జాగ్రత్తలు తీసుకోవాలి

● జిల్లా టీకాల అధికారి నాయనారెడ్డి

సారంగాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు గర్భిణీలకు ఇచ్చే వాక్సిన్లకు వైద్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా టీకాల అధికారి నాయనారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించి పిల్లలకు, గర్భిణీలకు ఇచ్చే వ్యాక్సిన్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని ఫార్మసి ఆఫీసర్ సంతోష్‌కు సూచించారు. దీంతో పాటు చించోలి బి, ధని ఆరోగ్య ఉప కేంద్రాల్లో నిల్వ ఉన్నటువంటి వ్యాక్సినేషన్ తీరును పరిశీలించారు. ఈమె వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ జవాద్, పర్యావేక్షకులు కృష్ణమోహన్‌గౌడ్, ప్రేమ్‌సింగ్‌లు ఉన్నారు.

వ్యాధుల బారిన పడకుండా జాగ్రతలు తీసుకోవాలి

మామడ, మే 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మామడ మండల ప్రత్యేక అధికారి రాజ నర్సయ్య అన్నారు. బుధవారం రోజున మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నీటి నిల్వ లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా చేసుకోవాలని కోరారు. వ్యాధులకు ప్రభావం లేకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల గురించి కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో ఎప్పటికప్పుడు నివేదిక మండల ఆఫీస్‌లో అందజేయాలన్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండివైద్యం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఎంపీడీవో సుశీల్ రెడ్డి, వైద్యాధికారి శ్రీకాంత్, ఏవో సంధ్య, ఇరిగేషన్ ఏఈ విఠల్, తదితరులు పాల్గొన్నారు.

తొలకరికి ముందే విత్తనాలు

కుంటాల, మే, 28 : (ఆంధ్రజ్యోతి) : గత వారం రోజుల నుండి తుఫాను కారణంగా పది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మండలంలోని పెంచికల్‌పాడ్, తదితర గ్రామాలలో రైతులు బుధవారం పత్తి పంటను విత్తే కార్యక్రమం మొదలు పెట్టారు. వాస్తవానికి మృగశిర కార్తే ఇంకా పది రోజుల గడువు ఉన్నప్పటికి భారీ వర్షాలు కురిసి విత్తనాలు మొలకెత్తేందుకు అనువైన తేమశాతం ఉందని విత్తనాలు విత్తుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

ఖానాపూర్‌కు ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు

● రూ. 200ల కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు ● ఉట్నూర్‌లో ఏర్పాటుకు 25 ఎకరాల స్థలం గుర్తింపు
● త్వరలో ప్రారంభం కానున్న నిర్మాణ పనులు ● ఫలించిన ఎమ్మెల్యే బొజ్జు మంత్రాంగం ● నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

ఖానాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో విప్లవాత్మక మార్పులే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఖానాపూర్ నియోజకవర్గానికి మంజూరు అయ్యింది. మొదటి దశలోనే ఖానాపూర్ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని కోరినట్లు చెబుతున్నారు. కాగా మొదటి దఫాలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరులో ఖానాపూర్‌కి స్థానం దక్కనప్పటికీ రెండో దఫాలో మాత్రం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మంత్రాంగం ఫలించినట్లు చెబుతున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ని ఆంధ్రజ్యోతి ఫోన్‌లో పలకరించగా... జీవో నెంబర్ 96 ద్వారా ఖానాపూర్‌కు ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం రూ. 200ల కోట్లు మంజూరైనట్లు ఆయన వెల్లడించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ తొలత ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేయాలని భావించినప్పటికీ సరిపడా స్థలం అందుబాటులో లేకపోవడంతో ఉట్నూర్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉట్నూర్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు కావలసిన 25 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలోనే పనులను ప్రారంభించేందుకు టెండర్లను పిలుస్తారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఖానాపూర్ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్ తమ నియోజకవర్గానికి మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.


ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరుతో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

ఖానాపూర్ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు కోసం ప్రభుత్వం నుండి రూ. 200 కోట్లు మంజూరు కావడం పట్ల నియోజకవర్గ వ్యాప్తంగా బుధవారం కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరిపాయి. ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో బుధవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తో ఖానాపూర్ నియోజకవర్గ విద్యార్థులకు మరింత మెరుగైన విద్య అందుబాటులోకి వస్తుందని సంతోషం వ్యక్తం చేశారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరుకి కృషి చేసిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కి స్కూల్ మంజూరుకి నిధులు మంజూరు చేసిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి అందుకు సహకరించిన మంత్రి సీతక్కకి పార్టీ శ్రేణులు కృతజ్ఞతలు తెలిపారు. ఖానాపూర్‌లో నిర్వహించిన ఈ సంబరాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనికేని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాజిద్, మున్సిపల్ మాజీ చైర్మన్లు చిన్నం సత్యం, అంకం రాజేందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడార్ల గంగ నర్సయ్య, మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, జిల్లా నాయకులు మడిగెల గంగాధర్, తోట సత్యం, జన్నారపు శంకర్, ఎల్మల శోభన్ బాబు, ద్యావతి రాజేశ్వర, మదిరే సత్యనారాయణ, గోవింద్, లక్ష్మీపతి, జహీర్, తదితరులున్నారు.



సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

కొనుగోలు కేంద్రం నిర్వాహకులను నిలదీసిన రైతులు



నర్సాపూర్(జి), మే 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందన్ గ్రామంలో బుధవారం రైతులు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. ధాన్యం తరలించడానికి వచ్చిన లారీలను సిబ్బంది ఇతర కొనుగోలు కేంద్రానికి పంపించడంపై నందన్ గ్రామ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల క్రితం తూకం వేసిన ధాన్యం బస్తాలను లారీలు రావడం లేదని సాకుతో రైతుల వద్ద డబ్బులు జమ చేసి లారీడ్రైవర్‌కు ముట్ట చెబితేనే లారీ వస్తుందని నిర్వాహకులు తెలపడంతో రైతులు నిర్వాహకులను నిలదీశారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన లారీలను సైతం సిబ్బంది వెనక్కి పంపించి తమ పొట్టకొడుతున్నారని వాపోతున్నారు. గతంలో ఆరోపణలు ఉన్న వారికి సెంటర్ నిర్వహణ బాధ్యత అప్పగింతపై రైతులు మండిపడ్డారు. వెంటనే ధాన్యం తూకం వేసి తరించాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

మండలంలోని గొల్లమాడ గ్రామంలో డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహ కులకు ఆయన సూచనలు చేశారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యా న్ని మిల్లులకు ఎప్పటికప్పుడు తరలించాలని ఆదేశించారు. కొనుగోళ్లలో జాప్యం చేయవద్దని నిర్వాహకులకు సూచించారు.

ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కసరత్తు

ముథోల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల పెంపునకు అధ్యాపకులు కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లు కళాశాలల్లో ప్రవేశాల పెంపనకు స్పెషల్‌డ్రైవ్ చేపడుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లోకి జూనియర్ లెక్చరర్లు పల్లె బాట పట్టి ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ ప్రభుత్వ కళాశాలల్లో వసతులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. అనుభవం గల అధ్యాపకులతో పాటు విశాలమైన తరగతి గదులు, ఆటస్థలం, చదువులో వెనుకబడిన విద్యార్థుల ప్రత్యేక శ్రద్ధ తదితర సౌకర్యాల గురించి 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రుల దగ్గరికి వెళ్లి అధ్యాపకులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని చెబుతున్నారు. ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతుందన్నారు. తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలలకే పంపాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వి. నారాయణ, గంగాధర్, సురేష్, స్వరూప, గణేష్, గోపాల్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

అధ్యాపకుల ప్రచారం

తానూర్ , మే 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని బుధవారం తానూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ప్రచారం నిర్వహించారు. మండలంలోని బోరిగావ్, ఎల్వీ గ్రామాల్లో పదోతరగతి పాసయిన విద్యార్థులను కలిసి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఫణి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. ఉచిత పుస్తకాలు, స్కాలర్‌షిప్, అనుభవజ్ఞులయిన అధ్యాపకులచే విద్యాబోధన, తదితర వాటిని వివరించారు. ప్రైవేటుకు దీటుగా ఇంటర్ ఫలితాలు రావడం జరిగిందని, విద్యార్థుల తల్లిదండ్రులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ఉపేందర్

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

దస్తురాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగాంను నిర్వహిస్తున్నట్లు అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఆకొండపేట గ్రామంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు సర్కిల్ అధికారులు సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా సరైన ధ్రువ పత్రాలు లేని 61 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, ఒక కారుకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు పాత వాహనాలు కొనేటప్పుడు వారి ధ్రువ పత్రాలు పరిశీలించి, అమ్మేవారి పేరుమీదే వాహనం ఉందా లేదా చూసుకోవాలన్నారు. మధ్యవర్తుల ద్వారా వాహనాలు కొంటే వెంటనే పాత ఓనర్ చేత కొన్నవారు వారిపేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. దొంగ వాహనాలు అమ్ముతున్నారని తెలిసిన యెడల వెంటనే వివరాలను దగ్గరలోని పోలీసులకు తెలపాలని కోరారు. రైతులకు సూచనలు ఇస్తూ డీలర్ల వద్ద, గుర్తింపు పొందిన దుకాణాల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసే ముందు విత్తన ప్యాకెట్లపై సరైన లేబుల్, ఎక్స్‌పైరీ డేట్, తయారీ డేట్ ఉంటాయని అదేవిధంగా వ్యాపారి వద్ద నుండి బిల్లును తీసుకోవాల్సిందిగా సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మేవారి వివరాలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలున్న తమ దృష్టికి తీసుకురావాలని లేదా సమస్యలుంటే 100 నెంబర్‌కి కాల్ చేయాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ అందరూ కలిగి ఉండాలన్నారు. కాలనీలో మరింత స్వీయ రక్షణ కొరకు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు. గ్రామంలో ఎవరైనా నిషేధిత గంజాయిని విక్రయించిన లేదా రవాణా చేసిన ఈ 8712659599కి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అజయ్, దస్తురాబాద్ ఎస్సై సాయి కుమార్, కడెం ఎస్సై కృష్ణ సాగర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థికి ఆర్థిక సహాయం

నిర్మల్ అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయిలో బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినయను మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి బుధవారం అభినందించారు. వచ్చే నెల జూన్ 4 నుంచి 7 వరకు గోవా రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి జూనియర్ అండర్- 17 బాలికల బాక్సింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్న నేపథ్యంలో రూ. 10 వేల ఆర్థిక సహాయం చేశారు. జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

నర్సాపూర్(జి), మే 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లమాడ గ్రామస్థులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం మాజీ సర్పంచ్ చెన్నా మహేష్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మధుకుమార్ రూ.60 వేల చెక్కు, సిందే సుధాకర్ రూ. 28,500ల చెక్కు, లస్మన్న రూ. 10 వేలు, సిందే మోహన్‌కు రూ. 60 వేల విలువ గల చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిందే ఛత్రపతి, గ్రామస్థులు పాల్గొన్నారు.





అసంపూర్తిగా దార్ కుభీర్ వంతెన నిర్మాణ పనులు

అసంపూర్తి వంతెనతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు

కుభీర్, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్ కుభీర్ గ్రామ సమీపంలో చేపడుతున్న వాగుపై వంతెన నిర్మాణ పనులు అసంపూర్తిగా అర్థాంతరంగా నిలిచి పోయాయి. రూ. 54లక్షల అంచాన వయంతో దాదాపు 7 నెలల క్రితం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పాటిల్ పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. పిల్లర్లు స్లాబ్ వేసిన గుత్తేదారు వంతెనకు ఇరువైపుల రోడ్డు పనులు చేపట్టక పోవడంతో వేసిన మట్టి వర్షానికి చిత్తడిగా మారింది. దీంతో ఈ మార్గాన ప్రయాణించే గ్రామస్థులు వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురువుతున్నామని చెబుతున్నారు. ఐదు, ఆరు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షాలకు వంతెనకు వేసిన మట్టి కొట్టుక పోతోందని చెబుతున్నారు. వర్షాకాలం కురిసే వర్షాలకు వంతెన పక్కన వేసిన మట్టి కొట్టుకు పోయి కోతకు గురయ్యే ప్రమాదముందని, ఈ విషయమై సంబంధిత శాఖ అధికారులకు గ్రామస్తులు పనులు పూర్తి చేయాలని కోరిన నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికయిన సంబంధిత శాఖ జిల్లా స్థాయి అధికారులు స్పందించి పనులు పూర్తి చేసి వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరుతున్నారు.



వర్షానికి కొట్టుకు పోతున్న మట్టి మొరం

బీటీ రోడ్డు కోసం రోడ్డెక్కిన కథ్‌గాం గ్రామస్థులు

● జాతీయ రహదారిపై రాస్తారోకో ● రెవెన్యూ డివిజన్ కార్యాలయ ముట్టడి ● ఆర్డీవో నిలదీత, టౌన్ సీఐతో వాగ్వాదం



ఆర్‌డీవో కారుకు అడ్డుగా కూర్చున్న కథ్‌గాం గ్రామస్థులు



సీఐ గోపినాథ్‌తో వాగ్వాదానికి దిగిన కథ్‌గాం గ్రామ మాజీ సర్పంచ్ రాజు

భైంసా, మే 28 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ భైంసా మండలంలోని కథ్‌గాం గ్రామస్థులు బుధవారం చేపట్టిన ఆందోళనలు హోరెత్తాయి. ఉదయం వేళలో గ్రామ మాజీ సర్పంచ్ దెగ్లూర్ రాజు నేతృత్వంలో కథ్‌గాం గ్రామస్తులు నిరసన ప్రదర్శనల ద్వారా ర్యాలీగా భైంసా - నిర్మల్ జాతీయ రహదారికి తరలివచ్చారు. గ్రామ క్రాస్ రోడ్డు సమీపంలోని జాతీయ రహదారిపై భైఠాయించి రాస్తారోకో చేపట్టి ఆందోళనలకు శ్రీకారం చుట్టారు. దీంతో జాతీయ రహదారి రోడ్డు మార్గానికి ఇరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. సంబంధిత సమాచారం అందుకున్న టౌన్ సీఐ గోపినాథ్ నేతృత్వంలోని పోలీసులు రాస్తారోకో విరమింప చేసేందుకు విఫలయత్నం చేశారు. సంబంధిత విషయంలో ఆందోళనకారులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. రాస్తారోకోతో ట్రాఫిక్ సమస్యల ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పరిస్థితిని గుర్తించిన పోలీసు అధికారులు ఆందోళనకారులను సముదాయించి శాంతపరిచి రాస్తారోకో విరమింప చేశారు. అక్కడ తగ్గినట్టే కనిపించిన గ్రామస్తులు అక్కడి నుంచి ర్యాలీగా ఇక్కడి రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి తరలివచ్చి ముట్టడించారు. విధుల నిర్వాహణలో భాగంగా తన వాహనంలో బయటకు వెలుతున్న అర్‌డీవో కోమల్‌రెడ్డిని కథ్‌గాం గ్రామస్తులు అడ్డుకున్నారు. కారు బయటకు వెళ్లకుండా అడ్డుగా కూర్చోని ముందుకు వెళ్లనీయకుండా చర్యలు చేపట్టారు. తమ గ్రామ రోడ్డు నిర్మాణం విషయంలో స్పష్టమైన హమీనిచ్చేంత వరకు ఇక్కడి నుంచి కదలబోమని వెల్లడించి భీష్మించుకొని కూర్చుండిపోయారు. అర్‌డీవో కార్యాలయ ముట్టడి సమాచారం అందుకున్న టౌన్ సీఐ గోపినాథ్ హుటహుటిన పోలీసు సిబ్బందితో రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి తరలివచ్చి ఆందోళనకారులను సముదాయించేందుకు విఫలయత్నం చెందారు. ఈ విషయంలో కథ్‌గాం గ్రామ మాజీ సర్పంచ్ దెగ్లూర్ రాజు సీఐ గోపినాథ్‌తో వాగ్వాదానికి దిగారు. అప్పటి వరకు కారులోనే ఉండిపోయిన అర్‌డీవో కోమల్ రెడ్డి సీఐ గోపినాథ్ సూచన మేరకు కారు నుంచి దిగి వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు.ఈ సందర్భంలో కథ్‌గాం గ్రామ మాజీ సర్పంచ్ దెగ్లూర్ రాజు అర్‌డీవో కోమల్ రెడ్డిని తీవ్రస్థాయిలో నిలదీసారు. రోడ్డు సమస్య కోసం గతంలో తాను అమరణ నిరాహార దీక్ష చేసిన సందర్భంలో బీటీ రోడ్డు నిర్మించే విషయంలో స్పష్టమైన హమీనిచ్చి అమలు చేయకుండా తాత్సరం ఎందుకు చేస్తున్నారంటూ ప్రశ్నించారు.ప్రస్తుతం రోడ్డు అధ్వాన్న స్థితికి చేరుకోవడం మూలంగా రాకపోకలు నిత్యం అవస్థలు తప్పడం లేదని వెల్లడించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాకపోకలు అవస్థలు అధికమయ్యాయని వివరించారు. జిల్లా కలెక్టర్, ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, సంబంధిత శాఖాధికారులు రోడ్డు నిర్మించే విషయంలో స్పష్టమైన హమీనిచ్చేంత వరకు కదలబోమని తేల్చి చెప్పి ఆందోళనలు కొనసాగించారు. దీంతో అర్‌డీవో కోమల్‌రెడ్డి ఉన్నతాధికారులకు సమస్యను వివరించి త్వరితగతిన పరిష్కరించేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తానని తెలుపడంతో గ్రామస్తులు తమ ఆందోళనలను విరమించారు.



ఆర్‌డీవోను నిలదీస్తూ..

సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటయ్యేనా..!?

● అంధకారంగా నేరడిగొండ రహదారి ● తరచూ చోటు చేసుకుంటున్న ప్రమాదాలు ● పట్టించుకోని అధికారులు



నేరడిగొండలో నాలుగు లేన్ల రహదారి



సెంట్రల్ లైట్లులేని జాతీయ రహదారి

నేరడిగొండ, మే 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-నాగ్‌పూర్ జాతీయ రహదారిగా విస్తరణ జరిగి పదిహెనెళ్ళ దాటింది. జాతీయ రహదారిగా విస్తరణ కాక ముందు రహదారి డబుల్ లెన్ల రహదారిగా ఉండేది. క్రమక్రమంగా జాతీయ రహదారిగా రూపుదిద్దుకోవడంతో నేడు వేలాది వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. నేరడిగొండ మండల కేంద్రం మధ్యలోంచి నాల్గు లేన్లుగా రహదారిని విస్తరించి రహదారి మధ్యన డివైడర్లు ఏర్పాటు చేశారు. కానీ రహదారి విస్తరణ చేపట్టి పదిహెనేళ్ళు గడుస్తున్నా సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయక పోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రస్తుతం నేరడిగొండ మండల కేంద్రంలో పూర్తిస్థాయిలో సెంట్రింగ్ లైటింగ్ సిస్టం లేకపోవడంతో ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో ప్రస్తుత ఎంపీ గోడం నగేష్ సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయిస్తానని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో సర్వే చేయించి హామీ ఇచ్చిన ఎంపీ హామీ మాత్రం నెరవేరలేదు. రాత్రి పూట దూర ప్రాంతాల నుంచి ప్రయాణికులు నేరడిగొండ మండల కేంద్రంలో దిగాలంటేనే జంకుతున్నారు. జాతీయ రహదారిపై పూర్తి స్థాయిలో సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారుల. పాలకుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని మండల ప్రజలు, స్థానిక ప్రజా ప్రతినిధులు వాపోతున్నారు.

● పెరిగిన వాహనాల రద్దీ ..

రహదారి విస్తరణ జరగడంతో రోజు రోజుకు వాహనాల రద్దీ పెరుగుతోంది. దీంతో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయడంలేదు. నేరడిగొండకు ఆనుకుని రహదారికి ఇరువైపులా వెంచర్లు చేస్తుండడంతో ప్లాట్ల విక్రయాలు, గృహ నిర్మాణాలు జోరందుకోవడంతో పాటు వాహనాలరద్దీ పెరిగింది. నేరడిగొండలో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేస్తె వెలుగులు విరజిమ్మడంతో పాటు ప్రత్యేక శోభను సంతరించుకుంటుంది. ఇప్పటికైనా ఎమ్మెల్యే,ఎంపీ,ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు స్పందించి సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

● ఇబ్బందులు తప్పడం లేదు

- జాదవ్ వసంత్‌రావ్ బుగ్గారాం గ్రామస్థుడు.



నేరడిగొండ మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఎర్పాటు చేయక పోవడంతో వాహనదారులకు రాత్రివేళలో ఎదురుగా వచ్చే వాహనాలు సరిగ్గా కనిపించక పోవడంతో ఇప్పటికే ఎంతోమంది ప్రమాదాలకు గురయ్యారు. ఇప్పటికైనా ఎన్‌హెచ్ ఏఐ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారిపై సెంట్రల్ లైటింగ్ సిస్టం ఎర్పాటుకు కృషి చేయాలి.

● సమస్యను పరిష్కరించాలి

- మందుల రమేష్ కుమారీ పీఏసీఎస్ అధ్యక్షుడు



రాత్రి వేళల్లోనేరడిగొండ మండల కేద్రం నుంచి వివిద గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు పెద్ద సంఖ్యలో రొడ్డుపైన నిలబడి ఉంటారు. ప్రస్తుతం అక్కడ క్కడ విద్యుత్ దీపాలున్న అవి పూర్తి స్థాయిలో లేవు. అధికారులు స్పందించి మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలి.

మద్దతు ధర పెంపుతో పెరగనున్న పత్తి పంట సాగు

బోథ్, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పత్తి మద్దతు ధరను పెంచడంతో ఆదిలాబాద్ జిల్లా రైతాంగం పత్తి పంట సాగుపై దృష్టి సారించింది. గత ఏడాది సీసీఐ అధికారులు క్వింటాల్‌కు పత్తికి 7521 చెల్లించి కొనుగోలు చేయడం జరిగింది. అయితే ఈసారి ప్రభుత్వం క్వింటాల్‌కు పత్తికి ఎనిమిది వేల ఒక వంద పది రూపాయలు మద్దతు ధరగా ప్రకటించడంతో పత్తి సాగు పెరిగే ఆస్కారం ఉందని పరిశీలకులు అంటున్నారు.

● దశాబ్దాల కాలంగా..

దశాబ్దాల కాలంగా బోథ్ ఆదిలాబాద్ నియోజకవర్గాల్లో పత్తి పంటను రైతులు సాగు చేస్తున్నారు. ప్రకృతి ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ఈ ప్రాంత రైతాంగం పత్తి పంట సాగును చేస్తున్నారు. స్థానికంగా పత్తి కొనుగోలు చేసేందుకు పత్తి మిల్లులు ఉండడంతో రైతాంగం పత్తి సాగు వైపే మొగ్గు చూపిస్తున్నారు. మరోవైపు పత్తి పంట సాగు చేయడం రైతాంగానికి అలవాటుగా మారడంతో తెల్ల బంగారంగా పేరు ఉన్న పత్తిని ధర పెరగడంతో సాగు విస్తీర్ణం తిరిగి ఆస్కారం ఉందని పరిశీలకులు అంటున్నారు.

● సోయా పై రైతుల ఆసక్తి

ఒకప్పుడు పత్తి పంటను నమ్ముకుని సాగు చేసిన రైతులు ఆర్థికంగా నష్టపోవడంతో ప్రత్యామ్నాయంగా అప్పటి జిల్లా కలెక్టర్ సుకుమార్ సోయాబీన్ పంటను జిల్లా రైతాంగానికి పరిచయం చేయడం జరిగింది. దీంతో సోయాబీన్ సాగుపై రైతులు ఆసక్తి కనబరిచారు. ఎకరానికి 8 నుండి 14 వరకు అప్పట్లో దిగుబడి వచ్చేది. క్రమక్రమంగా 6 నుండి 8 క్వింటాలకు దిగుబడి తగ్గిపోయింది. దీంతో రైతులు సోయా పంట సాగు పై అంతగా ఆసక్తి చూపలేదు. గత ఏడాది సోయాబీన్ పంట క్వింటాలకు 482 రూపాయలుగా కొనుగోలు చేయడం జరిగింది. మద్దతు ధర ప్రకటించిన ప్రైవేట్ మార్కెట్‌లో ధర లేకపోగా దిగుబడి సైతం తగ్గడంతో సోయా సాగుకు రైతులు ఆసక్తి చూపలేకపోయారు. ఈ ఏడాది ప్రభుత్వం క్వింటాలు సోయాబీన్ ధర 5328 రూపాయలుగా మద్దతు ధర ప్రకటించడంతో సోయా పంట సాగు సైతం పెరిగే ఆస్కారం ఉంది. నూనె గింజల పంట అయిన సోయాబీన్ సాగు సహితం పెరగనుందని అంటున్నారు. మరోవైపు సోయా పంట తొలగించిన అనంతరం రబీలో జొన్న పంట వేసి రెండవ పండగ సాగు చేస్తారు. జొన్న పంటకు ఈ ఏడాది ప్రభుత్వం 3371 రూపాయలుగా ఈ ఏడాది 3699 రూపాయలకు కొనుగోలు చేస్తామని మద్దతు ధర ప్రకటించారు. దీంతో రెండవ పండగ జొన్న సాగు విస్తీర్ణం తిరిగి ఆస్కారం ఉంది.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా అధ్యక్షులు బాలూరి గోవర్దన్ రెడ్డి

ఆదిలాబాద్ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లో జూన్ 8 నుంచి 11వ తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ హాకీ టోర్నమెంట్‌లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. టోర్నమెంట్లో పాల్గొనేందుకు జిల్లా క్రీడాకారుల జట్టు ఎంపిక పోటీలను బుధవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించారు. కప్‌ను సాధించాలనే ఉత్సాహం క్రీడాకారుల్లో ఉండాలన్నారు.

కూరగాయల సాగు.. భలే బాగు

● తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం
● కుచలాపూర్ టు రైతు బజార్..



కుచలాపూర్ వ్యవసాయ పొలంలో కూరగాయలు సాగు చేస్తున్న రైతులు



రైతులు సాగు చేసిన బెండకాయలను తెంపుతున్న రైతులు

తలమడుగు, మే 28 (ఆంధ్రజ్యోతి): అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని కుచులాపూర్ సాయి లింగి. సుంకిడి గ్రామాలకు చెందిన రైతులు కొన్నేళ్ల నుంచి వాణిజ్య పంటలైన పత్తి తదితర పంటలు సాగుచేసిన ఎలాంటి లాభం లేదని, వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీరడం లేదని నీటి వసతి కలిగిన రైతులు కూరగాయల పంటలపై దృష్టి సాధించారు. రైతుల పండించిన పంటలను నేరుగా పంట పొలాల నుంచి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రైతు బజారుకు తీసుకెళ్లి నేరుగా పండించిన కూరగాయలను విక్రయించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. తక్కువ పెట్టుబడి కుటుంబ సభ్యుల కలిసికట్టుగా పని చేసుకుని కూరగాయలను సాగు చేస్తూ ఆదర్శంగా రైతులు నిలుస్తున్నారు. ఇందులో భాగంగా తలమడుగు మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన రాగి కిషన్ ఈ సంవత్సరం జనవరి మాసంలో తనకున్న రెండు ఎకరాల పొలంలో 20 గుంట లలో బెండ, అలిచింత, బొబ్బరి కాయ, పంటలను సాగు చేశానని, కుటుంబం మొత్తానికి రోజు పనితో పాటు లాభం కూడా ఉందని కిషన్ తెలిపారు. వేసవి కాలంలో కూరగాయలకు ఎక్కువ డిమాండ్ ఉంటుందని, మూడు కూరగాయలు కిలో రూ.40లకు మార్కెట్లో అమ్ముతున్నానని, ఇప్పటి వరకు దాదాపుగా రూ.50 వేల లాభం పొందానని తెలిపారు. అదేవిధంగా సాయిలింగి గ్రామానికి చెందిన రైతులు కూరగాయలను సాగు చేసి ఆదిలాబాద్ రైతు బజార్‌లో విక్రయించుకుంటున్నారు. రైతుల పండించిన టమాట, మిర్చి, పాలకూర, మెంతికూర, కొత్తిమీర, గోంగూర, తోటకూర ఇతర ఆకుకూరలను మార్కెట్‌లో విక్రయించుకోవడం జరుగుతుందన్నారు. కూరగాయలు సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందిస్తే ఇంక మరికొంతమంది రైతులు ముందుకు కూరగాయల పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపిస్తారు. రైతుల పండించిన పంటలను దళా రులకు అమ్మకుండా నేరు గా మార్కెట్లో అమ్ముకోవడం సంతోషంగా ఉందన్నారు.

దోమ తెరలతో చేపల వేట



బీర్సాయిపేట పెద్ద చెరువు వద్ద దోమ తెరలతో చేపలు పడుతున్న గిరిజన మహిళలు

ఉట్నూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే అంటు వ్యాధుల నుం చి గిరిజన ప్రాంతాల ప్రజలను కాపాడడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దోమతెరలు పంపిణీ చేయగా అమాయక గిరిజనులు చేపల వేట కోసం దోమతెరలను ఉపయోగిస్తున్నారు. ప్రతియేటా వర్షాకాలంతో పాటు చలికాలంలో ఏజెన్సీ ప్రాంతాల్లోని గ్రామాల్లో దోమల ద్వారా మలేరియా, విష జ్వరాల ప్రభలకుండా ఉండడానికి గత ఐదేళ్ల క్రితం ప్రభుత్వం గిరిజన గ్రామాల ప్రజలకు దోమతెరలు పంపిణీ చేసింది. దోమ తెరలను వాడి ఆరోగ్య సంరక్షణ కోసం కృషి చేయాలని ప్రభుత్వం భావిస్తుంటే ఏజెన్సీలోని గిరిజనులు దోమ తెరలను చేపల వేటకు వాడుతుండడంతో అధికారులు అయోమయానికి గురవుతున్నారు. దోమ తెరలను సక్రమంగా వినియోగించుకునేలా గ్రామీణ ప్రాంతాలలో ఉన్న రాయి సెంటర్ల ద్వారా అవగాహన కల్పించాలని పరిశీలకులు అంటున్నారు.

కాలువలో అడ్డంగా కమ్యూనికేషన్

● శాఖల మధ్య సమన్వయ లోపం ● పట్టించుకోని అధికారులు ● వర్షాకాలం వస్తే ఇబ్బందులు



డ్రైనేజీలో ఉన్న బీఎస్ఎన్ఎల్ కేబుల్ పైప్‌లైన్‌కు అడ్డుగా చెత్తచెదారం చేరడంతో మురుగునీరు ముందుకు సాగడం లేదని చూపిస్తున్న స్థానికులు



అంతర చిత్రంలో అడ్డుగా కనిపిస్తున్న బీఎస్ఎన్ఎల్ కేబుల్ పైప్‌లైన్

ఇచ్చోడ, మే 28 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ పట్టణంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి వ్యాపార సముదాయాల్లోకి వరదనీరు చేరడంతో ఆంధ్రజ్యోతిలో నిండా ముంచిన వాన అనే కథనానికి గ్రామ పంచాయతీ అధికారులు బుధవారం మురుగు కాలువల్లో పూడికతీత చర్యలు చేపట్టారు. పూడికతీత చర్యల్లో భాగంగా మురుగు కాలువలో ఉన్న బీఎస్ఎన్ఎల్ కెబుల్ లైన్ పైపులు అడ్డుగా ఉండడంతో మురగుకాలువల్లో చెత్తచెదారం, ప్లాస్టిక్ కవర్లు పైపులకు అడ్డుతగలడంతో మురుగు నీరు ముందుకు సాగడం లేదు. మంగళవారం కురిసిన భారీ వర్షానికి వరద నీరు డ్రైనేజీల ద్వారా వెళ్లకుండా డ్రైనేజీ పొంగిపొర్లింది. విఠలేశ్వర మందిరానికి వెళ్లే దారి సమీపంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ పైప్‌లైన్ వద్ద డ్రైనేజీ మూసుకుపోవడంతో ముందున్న దుకాణా సముదాయాల్లోకి వరదనీరు చేరింది. దీంతో డ్రైనేజీ పైనుంచి రోడ్లపై వరదనీరు ఏరులై పారింది. మురుగునీరు మొత్తం రోడ్లపైకి రావడంతో అక్కడున్న వ్యాపారస్తులు మరుసటి రోజు ఆ కంపును భరించలేకపోతున్నారు. 30 ఏళ్ల క్రితం వేసిన బీఎస్ఎన్ఎల్ కేబుల్ ప్రస్తుతం పనిచేస్తున్నాయో.. లేదో.. తెలియదని పైప్‌లైన్ అడ్డుగా ఉండడంతో చెత్తచెదారం అడ్డు తగలడంతో మురుగు నీరు ముందుకు సాగక తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇకనైనా బీఎస్ఎన్ ఎల్ అధికారులు స్పందించి మురుగుకాలువలో ఉన్న పైపులైన్‌ను తొలగించాలని కోరుతున్నారు.

వేడుక ఏదైనా..
సందర్భం ఎటువంటిదైనా
☛ వివాహ వార్షికోత్సవం
☛ స్వదేశీ, విదేశీయానం
☛ లీగల్ ప్రకటనలు
☛ పదవీ విరమణ
☛ శ్రద్ధాంజలి
☛ జన్మదినం
☛ షష్టిపూర్తి
☛ జయంతి
☛ వర్ధంతి
☛ క్లాసిఫైడ్స్
మీ స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులకు ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా అతి తక్కువ రేట్లకే శుభాకాంక్షలు తెలియజేయండి
ఆంధ్రజ్యోతి
ప్రకటనల కొరకు సంప్రదించండి
ఆదిలాబాద్: 99854 11291
నిర్మల్ : 80966 77672
యాడ్స్ మేనేజర్ : 99854 11453


● సాత్నాల వాగు వరద నీటిలో కొట్టుకుపోయిన దత్తు(ఫైల్)


● వాగులో లభ్యమైన మృతుడి బైక్

వరద నీటిలో యువకుడి గల్లంతు

● సాత్నాల వాగులో లభ్యమైన బైక్
● లాండే దత్తు మృతదేహం కోసం ముమ్మరంగా గాలింపు

జైనథ్, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని సాత్నాల వాగు ఉప్పొంగి ప్రవహించింది. మండలంలోని తర్నం బ్రిడ్జిని తొలగించి ప్రయాణికులకు తాత్కాలికంగా లోలెవల్ బ్రిడ్జిని నిర్మించారు. ఈ లోలెవల్ బ్రిడ్జికి పైనుంచి వరద నీరు ప్రవహిస్తోంది. అయితే మంగళవారం రాత్రి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన లాండే దత్తు(30) తన మోటార్ సైకిల్ (ఏపీ019ఏజీ6853)పై ఆదిలాబాద్ నుంచి

(తరువాయి 6వ పేజీలో...)


సర్టిఫికెట్‌ను అందుకుంటున్న ప్రిన్సిపాల్ సంగీత

సీఎం చేతుల మీదుగా బోథ్ ప్రిన్సిపాల్‌కు ప్రశంసా పత్రం

బోథ్, మే 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సాంఘిక సంక్షేమ గ్రూపుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ సంగీత బుధవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా బెస్ట్ ప్రిన్సిపాల్‌గా ప్రశంసాపత్రం అందుకున్నారు. అంతేగాక సీఎం కళాశాల అభివృద్ధి కోసం రూ.ఐదు లక్షల చెక్కును అందించారు. సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో చదివి, అదే కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న ఈమె ఇంటర్మీడియట్లో వంద శాతం ఫలితాల రాక కోసం తీవ్రంగా కృషి చేశారు.

జలమయమైన వేణునగర్ పరిస్థితులపై ఎమ్మెల్యే బొజ్జు ఆరా

ఉట్నూర్, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కారం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న వేణునగర్ కాలనీ మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జలమయం అయ్యింది. సమాచారం అందుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హుటాహుటిన వేణునగర్ కాలనీకి చేరుకుని స్థానికులతో కలిసి పరిస్థితులపై ఆరా తీశారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ అమృత్‌లాల్‌కు సహాయక చర్యలు చేపట్టి అడ్డుగా ఉన్న కట్టడాలను తొలగించాలని ఆదేశించారు. రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపిందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు.

● తర్నం బ్రిడ్జి వద్ద నిర్మించిన తాత్కాలిక వంతెన



దారి కష్టాలు.. ఇంకెన్నాళ్లు?

▸ జిల్లాలో నత్తనడకన సాగుతున్న 353(బి) జాతీయ రహదారి పనులు ▸ తర్నం బ్రిడ్జి నిర్మాణంలో తీవ్ర జాప్యం.. ప్రయాణికుల ఇబ్బందులు ▸ గత రాత్రి వరద నీటిని దాటుతుండగా ఓ యువకుడు గల్లంతు ▸ ప్రమాదకరంగా మారిన తాత్కాలిక వంతెన నిర్మాణం ▸ కాంట్రాక్టర్, హైవే అధికారుల నిర్లక్ష్యంతో రాకపోకలకు అంతరాయం

ఆదిలాబాద్, మే 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాత్నాల వాగుపై నిర్మించిన తర్నం బ్రిడ్జి గత రెండేళ్ల క్రితం బీటలు వారి ధ్వంసం కావడంతో అంతర్ రాష్ట్ర రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గత ప్రభుత్వం రూ.40 కోట్ల నిధులను మంజూరు చేసి జిల్లా కేంద్రం నుంచి నిరాల వరకు ప్రత్యామ్నాయ మార్గం పనులను చేపట్టారు. అయినా భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆదిలాబాద్-బేల-మహారాష్ట్రలోని రాజురా వరకు 353(బి) జాతీయ రహదారి 33 కి.మీ.ల మేర విస్తరణ పనులకు గాను గత ప్రభుత్వ హయాంలోనే రూ.490 కోట్ల నిధులను మంజూరు చేశారు. ఇందులో రూ.194 కోట్లకు టెండర్‌లను పూర్తి చేసి రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించారు. అలాగే రూ.25 కోట్ల నిధులతో తర్నం బ్రిడ్జి నిర్మాణం పనులను చేపట్టేందుకు మహారాష్ట్రకు చెందిన ఆర్‌బి షెొట్కె కాంట్రాక్ట్ కంపెనీకి పనులను అప్పగించారు. అగ్రిమెంట్ పూర్తయి ఏడాదైనా ఎక్కడి పనులు అక్కడే అన్నట్లుగా కనిపిస్తున్నాయి. ఈ బ్రిడ్జి మీదుగానే జైనథ్, బేల, మహారాష్ట్ర ప్రాంతాలకు నిత్యం వందలాది వాహనాల రాకపోకలు సాగుతాయి. ఎంతో ప్రాధాన్యత గల ఈ బ్రిడ్జి నిర్మాణంపై అధికారులు నిండు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాకుండా తరచు ప్రమాదాలు జరుగడంతో ప్రజలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుందని ప్రతిపక్షాలు విమర్శలకు దిగుతున్నాయి.

పనులు చేపట్టేందుకే బ్రిడ్జిని కూల్చి వేశాం

: డి.సుభాష్, నేషనల్ హైవే డీఈఈ

తర్నం బ్రిడ్జి స్థానంలో కొత్తగా మరో బ్రిడ్జిని నిర్మించేందుకు పాత బ్రిడ్జిని కూల్చి వేశాం. త్వరలోనే పనులను ప్రారంభిస్తాం. అగ్రిమెంట్ ప్రకారం మరో ఏడాది సమయం ఉంది. గడువు సమయంలోగా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దాదాపుగా రోడ్డు విస్తరణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. లోలెవల్ వంతెనకు ఇరువైపుల భద్రత చర్యలు చేపడుతాం. వర్షాకాలంలో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి. ప్రత్యామ్నాయంగా ఆదిలాబాద్ టూ నిరాల వరకు రోడ్డు సౌకర్యం ఉంది. వర్షాకాలంలో ఈ మార్గం గుండానే రాకపోకలు సాగించాలి.


గల్లంతయిన మృతుడి కోసం గాలిస్తున్న గజ ఈతగాళ్లు

అధికారుల తప్పుడు నిర్ణయాలు

తర్నం బ్రిడ్జి నిర్మాణంలో అడుగడుగునా అధికారుల తప్పిదాలు కనిపిస్తున్నాయి. అడిగే వారే లేకపోవడంతో ఇష్టారాజ్యంగా పనులు కొనసాగుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. గతేడాది మే మాసంలో అగ్రిమెంట్ పూర్తి చేసుకున్న సంబంధిత కాంట్రాక్ట్ కంపెనీ ఇప్పటి వరకు పనులను ప్రారంభించక పోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఇన్నాళ్లు పగుళ్లు తేలిన బ్రిడ్జిపై నుంచే ద్విచక్ర వాహనాలు, ప్రయాణికులు రాకపోకలు సాగించారు. అయితే వానాకాలంలో పనులను చేపట్టేందుకు అసలు అవకాశమే లేకపోయినా.. ఉన్న బ్రిడ్జిని కూల్చి వేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం అవసరం లేకపోయినా.. తర్నం బ్రిడ్జిని కూల్చి వేయడంపై స్థానికులు మండిపడుతున్నారు. భారీ వాహనాలను అనుమతించక పోయినా.. ద్విచక్ర వాహనాల రాకపోకలకు బ్రిడ్జి అనువుగా ఉండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వర్షాకాలం ముగిసిన తర్వాత బ్రిడ్జిని కూల్చి పనులు ప్రారంభిస్తే బాగుండేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అసలు బ్రిడ్జి నిర్మాణమే ప్రధానమైనా.. కాంట్రాక్టర్ మాత్రం రోడ్డు విస్తరణ పనులను చేపట్టడం ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. మొదట బ్రిడ్జి నిర్మాణం పనులను పూర్తి చేసి రోడ్డు విస్తరణ పనులను

(తరువాయి 6వ పేజీలో...)


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ అతుల్

గర్భిణులపై ప్రత్యేకదృష్టి సారించాలి

● డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ అతుల్

నేరడిగొండ, మే 28 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు బాలింతలపై ప్రత్యేకదృష్టి సారించాలని డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ అతుల్ అన్నారు. బుధవారం మండలంలోని బుగ్గారం గ్రామంలో గల సబ్ సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆశా కార్యకర్త రికార్డులు, మందులను పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించి, ఎప్పటికప్పుడు మందులు అందించాలని సూచించారు. ఇందులో హెల్త్ సూపర్ వైజర్లు స్వర్ణలత, ఏఎన్ఎం పవార్ జ్యోతి, ఆశా కార్యకర్త రాథోడ్ కమలాబాయి పాల్గొన్నారు.

గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి : ఎంపీడీవో

ఇచ్చోడ, మే 28(ఆంధ్రజ్యోతి): వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో లక్ష్మణ్ పంచాయితీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి సూచించారు. బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు పడగానే హడావుడి చేయకుండా ముందుగా లోతట్టు ప్రాంతాలను గుర్తించాలన్నారు. మురుగు కాలువల్లో పూడిక తొలగించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా గ్రామస్థులందరి సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించాలన్నారు. ఇందులో ఉపాధి హామీ ఏపీవో నరేందర్‌గౌడ్, సిబ్బంది, తదితరులున్నారు.

నార్నూర్ రూరల్: వర్షాలు పడుతున్నాయి.. ఎట్టి పరిస్థితుల్లోనూ మురికి కాలువ నీరు ఆపడానికి వీల్లేదు అని ఎంపీడీవో గంగాసింగ్ రాథోడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని దుర్గానగర్‌లో స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా వంద మీటర్ల వరకు మురికి కాలువ నిర్మించాలని వారు కోరగా.. సంబంధిత అంశాలపై పీఆర్ఏఈ, సిబ్బంది కొలత తీసుకున్నారు. ఇందులో ఎంపీవో సాయి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మోతీరాం, గ్రామస్థులున్నారు.

ఇప్పపువ్వు లడ్డును దేశవ్యాప్తం చేస్తాం

● ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్


లక్ష్మణ్‌కు ఇప్పపువ్వు లడ్డులను అందజేస్తున్న రితేష్ రాథోడ్

ఉట్నూర్, మే 28(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ గిరిజన మహిళల ఆదివాసీ ఆహారం ఇప్పపువ్వు లడ్డును దేశవ్యాప్తంగా విస్తరింప చేస్తామని బీజేపీ ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ వెల్లడించారని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్‌రాథోడ్ తెలిపారు. ప్రధాని మోదీ ప్రశంసించడంతో డాక్టర్ లక్ష్మణ్‌కు గిరిజనుతు తయారు చేసిన ఇప్పపువ్వు లడ్డును రితేష్ రాథోడ్ మంగళవారం రాత్రి అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ మన్‌కీ బాత్‌లో గిరిజనులు తయారు చేస్తున్న ఇప్పపువ్వు లడ్డుల గురించి ప్రదానమంత్రి ప్రస్తావించారన్నారు. అది సరికొత్త ప్రయోగమని అందులో ఆదివాసీల సంస్కృతి, తీయదనం కూడా దిగి ఉందని కొనియాడారన్నారు. లడ్డును రాజ్యసభ సభ్యులు డా.లక్ష్మణ్‌కి లడ్డు రుచి చూపించామన్నారు. దీని పై స్పందించిన డా.లక్ష్మణ్ ఇప్పపువ్వు లడ్డును దేశవ్యాప్తంగా విస్తరింప చేస్తామని రితేష్‌రాతోడ్‌కు హామీ ఇచ్చినట్లు తెలిపారు. రితేష్‌రాథోడ్‌తో పాటు ఎస్టీ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు కళ్యాణ్ నాయక్ ఉన్నారు.

గిరిజన నిరుద్యోగులకు శిక్షణ సర్టిఫికెట్ల అందజేత

ఉట్నూర్, మే 28(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) టీజీఎస్ఆర్టీసీ ఆదిలాబాద్ డిపో వారి ఆధ్వర్యంలో నెల రోజుల బస్సు డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న గిరిజన నిరుద్యోగ యువకులకు శిక్షణ సర్టిఫికెట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా పంపిణీ చేశారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని విలంబీ ప్రాంగణంలో ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో గత నెల 21నుంచి ఈ నెల 22 వరకు గిరిజన నిరుద్యోగ యువకులకు హెవి బస్ డ్రైవింగ్ శిక్షనను వసతితో కూడిన విధంగా ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు. 15 మంది గిరిజన యువకులు ఒక నెల రోజుల పాటు శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకోవడంతో బుధవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా క్యాంపు కార్యాలయంలో సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీఓ ఖుష్బుగుప్తా మాట్లాడుతూ నిరుద్యోగ గిరిజనులు స్వయం ఉపాధి శిక్షణలో పొంది ప్రైవేట్ రంగాలలో స్థిరపడాలని, ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగాలు రావని గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, సూపరింటెండెంట్ శకుంతల, జాబ్స్ డిస్ట్రిక్ట్ మేనేజర్ నాగభూషణం, ఈజీ ఎంఎంస్టాప్ మరియు ఆర్టీసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ సర్టిఫికెట్లను అందజేస్తున్న పీవో

సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటయ్యేనా?!

● 15 ఏళ్లుగా అంధకారంలో నేరడిగొండ రహదారి



వివరాలు 7వ పేజీలో...


నిపానిలో క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుమలత

క్షయ వ్యాధి నివారణ కోసం చర్యలు

● జిల్లా క్షయ నివారణ అధికారి సుమలత

భీంపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నివారణ కోసం ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సుమలత అన్నారు. ఆమె టిబి ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా బుధవారం మండలంలోని నిపాని పల్లె దవాఖాన, తాంసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రతీనెల పౌష్టిక ఆహారం కోసం రూ.వెయ్యి అందజేస్తామని, అదే గిరిజన గ్రామాల వారికి రూ.750 రవాణా ఖర్చుల కోసం అదనంగా అందజేస్తామన్నారు. ఇందులో మండల వైద్యాధికారి శ్రావ్య వాణి, సిబ్బంది సంపత్ కుమార్, దివ్య, ప్రమీల, తులసి రామ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ డిపో నుంచి కిన్వాట్, మాహోర్ బస్సు సర్వీసుల ప్రారంభం

బోథ్, మే 28 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ డిపో అధికారులు బోథ్ మీదుగా మాహోర్, కిన్వాట్ వరకు నాలుగు బస్సు సర్వీసులను ప్రారంభించారు. గతంలో నడిపిన విధంగానే ఉదయం నిర్మల్ నుంచి 5.15 గంటలకు కిన్వాట్ బస్సు ప్రారంభమవుతుందని, అలాగే నిర్మల్ నుంచి సాయంత్రం 5 గంటలకు మరో బస్సును ప్రారంభమవుతుంది. ఇక నిర్మల్ నుంచి ఉదయం 7.40 గంటలకు మాహోర్ బస్సును ప్రారంభమవగా.. ఆ బస్సు 8.30 గంటలకు బోథ్‌కు చేరుకొని 11గంటల వరకు మాహోర్ చేరుకోనుంది. నూతనంగా రెండు అంతర్ రాష్ట్ర సర్వీసులు ప్రారంభించడంతో ఈ ప్రాంత ప్రయాణికులకు మహారాష్ట్రకు వెళ్లే వారికి సౌలభ్యం ఏర్పడింది.

'పంట మార్పిడి పద్ధతి పాటించాలి'

తాంసి, మే 28 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువులను తక్కువ మోతాదులో వాడి ఖర్చులను తగ్గించుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రాంప్రసాద్ సూచించారు. బుధవారం మండలంలోని పాలోడి గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పంట మార్పిడి పద్ధతి పాటించి సుస్థిర ఆదాయాన్ని పొందాలని అన్నారు. శాస్త్రవేత్తలు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులను విడుదల చేయాలి

బోథ్, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు పంట పెట్టుబడుల కింద ఇచ్చిన హామీని ఎలాంటి ఆంక్షలు లేకుండా నెరవేర్చాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న ప్రభుత్వానికి బుధవారం ఆయన డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎకరానికి రూ.12 వేలు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి హామీని నెరవేర్చాలన్నారు. గత రబీ లో పంట పెట్టుబడి పూర్తిస్థాయిలో వేయలేదని, దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారన్నారు. జిల్లాలో లక్షా 6,359 మంది రైతులు ఉండగా.. లక్షా 371 మంది రైతులకు మాత్రమే రైతు భరోసా నిధులు ఖాతాల్లో జమ చేశారన్నారు.

పేదల అభ్యున్నతికి ఎన్టీఆర్ ఎనలేని కృషి

● టీడీపీ ఆదిలాబాద్ నియోజకవర్గ కన్వీనర్ అల్లూరి రాజారెడ్డి ● జిల్లాలో ఘనంగా ఎన్.టీ. రామారావు 102వ జయంతి వేడుకలు ● నివాళ్లు అర్పించిన నాయకులు, కార్యకర్తలు

ఆదిలాబాద్ అర్బన్, మే 28(ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ఎనలేని సేవలు అందించారని టీడీపీ ఆదిలాబాద్ నియోజకవర్గ కన్వీనర్ అల్లూరి రాజారెడ్డి అన్నారు. పట్టణంలో బుధవారం టీడీపీ వ్యవస్థాపకులు, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 102వ జయంతిని నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఎన్టీఆర్ చౌక్‌లోని ఆయన విగ్రహాం వద్ద నివాళులర్పించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటంతో పాటు విగ్రహానికి పుష్పాంజలి సమర్పించి అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. పేదలు పడుతున్న కష్టాలను చూసి ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రాజారెడ్డి అన్నారు. బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పార్టీ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు నూనెసతీష్, గంగసరపు ఓమన్న, గాలిపెల్లి నాగన్న, ఆకుల రాము, సోమ గంగారెడ్డి, తోకల లస్మన్న, జక్కుల సుభాష్, గోక శ్రీనివాస్‌రెడ్డి, కదరపు దేవదాస్, తోకల గంగమ్మ, ఓసా ప్రమోద్, పెంటన్న, అంబు బాయ్, ప్రశాంత్, రూపమ్మ, తదితరులు పాల్గొన్నారు.


ఆదిలాబాద్‌లో నివాళ్లు అర్పిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు


● ఉట్నూర్‌లో ఎన్టీఆర్ జయంతిని నిర్వహిస్తున్న అభిమానులు

ఉట్నూర్: మండలకేంద్రంలో బుధవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతిని అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహానికి అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అభిమానులు సీపతిలింగాగౌడ్, సాడిగే రాజేశ్వర్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 40 ఏళ్ల అధికారంలో ఉన్నప్పుడు పేద బలహీన వర్గాలను పట్టించుకోకుండా ఉన్నత వర్గాలకు కొమ్ము కాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు తెలుగుదేశం పార్టీని స్థాపించి 9 నెలలకే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ప్రజలతో పాటు ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించినా మహానేత దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అన్నారు. ఇప్పుడున్నా కొంత మంది మంత్రులు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రితో సహా ఆయన ద్వారానే ఈ రోజు వరకు ఇంకా సేవలు అందిస్తున్నారంటే ఆయన పెట్టిన భిక్ష అని అన్నారు. ఏ ప్రభుత్వంలో ఉన్న నందమూరి తారకరామారావుని మరువకూడదని అందుకే మహానేత యుగ పురుషుడికి పార్టీలకతీతంగా నివాళులర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో కుటికెల రమేష్, జాదవ్‌రవి, సురేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

● 'పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తాం'

బోథ్: టీడీపీకి పూర్వవైభవం తీసుకొస్తామని ప్రజల్లో తెలుగుదేశం పార్టీ చేపట్టిన కార్యక్రమాలు చిరస్థాయిగా ఉన్నాయని మండల పార్టీ కన్వీనర్ మల్లెపూల శివారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పార్టీ 43వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా బోథ్ బస్టాండ్‌లో పార్టీ జెండాను

(తరువాయి 6వ పేజీలో...)